క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



సజ్జలగుడ్డం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నిత్యానందరాజు

కోసిగి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ నిత్యానందరాజు సూచించారు. శుక్రవారం కోసిగి మండలంలోని సజ్జలగుడ్డం గ్రామ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనం పరిశీలించి వంట ఏజెన్సీలకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి రోజూ భోజనం ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యతగా లేకుంటే ఫిర్యాదు చేయాలన్నారు. పాఠశాలలో తాగునీటి వసతి, మౌలిక వసతులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు పాఠశాలలో లేక పోవడంతో ఎక్కడికి వెళ్లారని ఆరా తీశారు. వీఆర్వోలు, గ్రామస్తులు, వీఆర్ఏలు వెంట ఉన్నారు.

శివారు కాలనీలను అభివృద్ధి చేయాలి



సంజీవ్‌నగర్‌లో బురదమయమైన రోడ్డును చూపుతున్న సీపీఐ నాయకులు, స్థానికులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ శివారు కాలనీలను అభివృద్ధి చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సహాయ కార్యదర్శి సమీవుల్లా, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఈరన్న డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సంజీవ్ నగర్‌లో ఆ ప్రాంత వాసులతో కలిసి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. గ్రేడ్ వన్ మున్సిపాలిటీ శివారు ప్రాంతాల్లో కనీస సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డ్రైన్లు,సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు.

పట్టణ సుందరీకరణకు చర్యలు



డివైడర్‌లో ఈత చెట్లను నాటిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ అభివృద్ధితో పాటు సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కర్నూలు బైపాస్ రోడ్డు డివైడర్‌లో ఈత చెట్లను నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు బైపాస్ రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రధాన రహదారులు, సర్కిల్‌లను గుర్తించేలా సైన్ బోర్డులు కూడా ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ ఏఈ మదన్ ఉన్నారు.

ప్రొటోకాల్ పాటించలేదు



మాచాపురంలో మాట్లాడుతున్న సర్పంచు, వార్డు మెంబర్లు

నందవరం : గ్రామ సభలో ప్రొటోకాల్ పాటించలేదని మాచాపురం గ్రామ సర్పంచు, వార్డు సభ్యులు ఆందోళనకు దిగారు. గ్రామ సచివాలయంలో టీడీపీ నాయకులు కుర్చీల్లో కూర్చుని, తమకు సీట్లు కేటాయించలేదని సర్పంచు కిష్టప్ప పేర్కొన్నారు. అధికారులు సభలో సర్పంచు, వార్డు సభ్యులను పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటి గ్రామ సభలతో ప్రయోజనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనలో ఎంపీటీసీ ఆగ్నేశమ్మ, ఉప సర్పంచు కోటప్ప, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆదాని కుంభకోణంపై దర్యాప్తు చేపట్టాలి



సోమప్ప సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఆదాని కుంభకోణంపై దర్యాప్తు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఖాశింవలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. అదాని కుంభకోణంపై సెబీ చీఫ్ అక్రమాలకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ సెబీ చీఫ్‌నకు వ్యాపారవేత్తలతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడా వ్యాపారులకు అండగా నిలుస్తూ అక్రమాలకు తెరలేపిందన్నారు. నాయకులు బనవాసి జైపాల్,లోకేష్, రఫీక్, నబీరసూల్, ఇమ్రాన్, అక్బర్,ఇబ్రహీం, కుమార్, అజయ్ పాల్గొన్నారు.

వైద్యులకు ప్రత్యేక రక్షణ కల్పించాలి



ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే డాక్టర్లు, వైద్య సిబ్బందికి ప్రత్యేక రక్షణ కల్పించాలి. ప్రమాదాలు, ఇతర సంఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వచ్చే వారు రకరకాలుగా ఉంటారు, ఆవేశంలో డాక్టర్లు, స్టాఫ్‌పై దౌర్జన్యానికి దిగుతారు అటువంటి పరిస్థితుల్లో ఏమి చేయలేని పరిస్థితి. రాత్రి డాక్టర్లు, నర్సులు, సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు, సెక్యూరీ గార్డ్స్ ఉన్నా, ఒక్కోసారి మద్యం సేవించి వచ్చే వారి నుంచి రక్షణ కల్పించాలి. ఆసుపత్రుల్లో దురుసుగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ మైత్రేయి, సూపరింటెండెంట్, ప్రభుత్వాసుపత్రి, ఎమ్మిగనూరు

డాక్టర్ల రక్షణ చట్టం తేవాలి



కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి. డ్యూటీలో ఉన్న మహిళా డాక్టర్లకు భద్రత లేకపోతే విధులు ఎలా నిర్వహిస్తారు. డాక్టర్లకు రక్షణ కల్పించాలి, భద్రత ఏర్పాట్లు చేయాలి. వైద్యులపై ఒత్తిడి తగ్గించాలి. కోలకతా హత్యాచారం లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. నేరస్తులు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించినప్పుడే వైద్యులు నిర్భయంగా సేవలందించగలుగుతారు. దేశంలో వైద్యులకు రక్షణ లేకుండా పోయింది. డాక్టర్లకు రక్షణ కల్పించే దేశవ్యాప్తంగా ప్రత్యేక చట్టం అమలు చేయాలి.

– డాక్టర్ రజిత, సివిల్ అసిస్టెంట్ సర్జన్, కోసిగి

రోడ్డు ధ్వంసం.. రాకపోకలకు కష్టం

- భారీ వర్షాలకు కోతకు గురైన దేవరబెట్ట గ్రామ రోడ్డు
- కాలినడకన వంకను దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితి
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, ప్రజలు
- వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రజల విన్నపం



వంక వద్ద పూర్తిగా కొట్టుకుపోయిన రోడ్డు

కోసిగి: మండలంలోని సజ్జలగుడ్డం మజరా గ్రామమైన దేవరబెట్ట గ్రామ ప్రజలు రోడ్డు సౌకర్యం లేక అష్టకష్టాలు పడుతున్నారు. సజ్జలగుడ్డం– జంపాపురం గ్రామాల మెయిన్ రోడ్డు నుంచి దేవరబెట్ట గ్రామానికి 1.26 కిలోమీటర్ల దూరం ఉంది. మెయిన్ రోడ్డు నుంచి మట్టి రోడ్డులో గ్రామానికి చేరుకోవాలి. ఈ గ్రామంలో 72 కుటుంబాలు 350 మంది జనాభా నివశిస్తున్నారు. గ్రామ ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి, పట్టణాలకు వెళ్లాలంటే మట్టి దారి వెంబడి కాలినడకన లేదా సైకిళ్లు, బైక్‌లపై వెళ్లాల్సిందే.

కొట్టుకుపోయిన రోడ్డు

సజ్జలగుడ్డం గ్రామం మెయిన్ రోడ్డు నుంచి దేవరబెట్ట గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డులో భారీ వంక ఉంది. వర్షాలు కురిస్తే కోసిగి, సజ్జలగుడ్డం గ్రామాల పైభాగం నుంచి వంకలో వర్షపు నీరు ప్రవహిస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి పైప్రాంతాల నుంచి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో వంకపై ఏర్పాటు చేసిన కల్వర్టు, పైపులు సైతం కొట్టుకుపోయాయి. భారీ స్థాయిలో రోడ్డు కోతకు గురైంది. నడిచి వెళ్లేందుకు కూడా వీల్లేని విధంగా తయారైంది.

గతంలో ఇదే దుస్థితి

దేవరబెట్ట మజరా గ్రామం కావడంతో గ్రామాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. 2009లో భారీ వర్షాలకు వరద సంభవించడంతో కోతకు గురై రోడ్డు కొట్టుకుపోయింది. వరద తగ్గాక తాత్కాలికంగా సిమెంట్ పైప్‌లు వేసి కంకర వేసి రోడ్డును పూడ్చేశారు. ఈ స్థితిలో మూడేళ్ల క్రితం మరోసారి రోడ్డు కోతకు గురికావడంతో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సొంత నిధులతో కల్వర్టు, పైపులు వేయించి రాకపోకలకు సౌకర్యం కల్పించారు. ఇదిలాఉండగా ఈ నెల 20వ తేదీన తెల్లవారుజామున మండలంలో 96.2 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. ఈ వర్షానికి మట్టి కోతకు గురై రోడ్డు ధ్వసమైంది. పైప్‌లు, కల్వర్టు సైతం కొట్టుకుపోయి గ్రామానికి వెళ్లడానికి వీల్లేకుండా తయారైంది.

గ్రామస్తుల కష్టాలు

గ్రామం నుంచి ప్రతి రోజు 60 మంది విద్యార్థులు జంపాపురం ఉన్నత పాఠశాలకు, మరికొందరు కోసిగి కళాశాలకు, ఆదోని డిగ్రీ కళాశాలకు వెళుతున్నారు. ప్రస్తుతం రోడ్డు ధ్వంసం కావడంతో పుస్తకాలు మోసుకుని వంకలో దిగి నడిచి వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. గ్రామం నుంచి జంపాపురం హైస్కూల్‌కు 2.50 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిందే. బైక్‌లు, సైకిళ్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. దీంతో వివిధ పనులకు, అత్యవసర వైద్య సేవలకు రాకపోకలు సాగించేందుకు కష్టంగా మారిందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వంతెన నిర్మించి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామానికి శాశ్వతంగా రోడ్డు ఏర్పాటు చేయించి, వంతెన నిర్మించి కష్టాలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రూ.1.50 కోట్లకు ప్రతిపాదనలు పంపాం

ఇటీవల కురిసిన వర్షానికి దేవరబెట్ట గ్రామ రోడ్డు పూర్తి కొట్టుకుపోయింది. గ్రామం నుంచి సజ్జలగుడ్డం మెయిన్ రోడ్డు వరకు 1.26 కిలోమీటర్ల రోడ్డు ఉంది. శాశ్వతంగా కల్వర్టు, తారు రోడ్డు వేసేందుకు రూ.1.50 కోట్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. తాత్కాలికంగా నడిచి వెళ్లేలా రోడ్డు ఏర్పాటుకు రూ.10 లక్షలు కేటాయించాలని జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేయిస్తాం.

– నరసింహులు, పీఆర్ ఏఈ, కోసిగి

అనునిత్యం కోసిగికి వెళ్లాల్సిందే



గ్రామం నుంచి నిత్యం వివిధ పనుల కోసం కోసిగికి వెళ్లాల్సి ఉంటుంది. ఎరువులు, పనిముట్లు, పంట దిగుబడి అమ్ముకునేందుకు మండలకేంద్రానికి వెళ్లాల్సిందే. గ్రామానికి బస్సు సౌకర్యం సరిగ్గా లేదు. రోడ్డు కోతకు గురికావడంతో బైక్‌లోనూ వెళ్లలేం. మా పరిస్థితి దారుణంగా తయారైంది.

– వీరేష్, రైతు, దేవరబెట్ట

అత్యసవర పనులకు ఇబ్బందిగా ఉంది



మాది మజరా గ్రామం. రాత్రి వేళల్లో అత్యవసరం అయితే బైక్‌లు వేసుకుని మండలకేంద్రానికి వెళ్లేవాళ్లం. ప్రస్తుతం రోడ్డు కొట్టుకుపోవడంతో బైక్‌లు కూడా వెళ్లలేని విధంగా తయారైంది. భారీ వర్షం వస్తే చాలా కష్టంగా మారుతోంది. అధికారులు, పాలకులు స్పందించి గ్రామానికి శాశ్వతంగా రోడ్డును ఏర్పాటు చేయాలి.

– శ్రీనివాసులు, గ్రామస్తుడు

వంకలో వెళ్లాలంటే కష్టంగా ఉంది



నేను జంపాపురం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. గ్రామం నుంచి పాఠశాలకు 2.50 కిలో మీటర్ల దూరం ఉంది. రోజూ కాలినడకన వచ్చి వెళుతున్నాం. ఇటీవల వర్షానికి రోడ్డు కొట్టుకుపోవడంతో వంకలో దిగి వర్షం నీటిలో నడుచుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతూ వెళ్తున్నాం. రోడ్డు వసతి ఏర్పాటు చేసి కష్టాలను తొలగించాలి.

– చిన్న లక్ష్మి, 10వ తరగతి విద్యార్థిని

ఫార్మా కంపెనీపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: అచ్యుతాపురం సెజ్ ఫార్మా కంపెనీలో ఘోర ప్రమాదం జరిగి 18 మంది కార్మికుల మృతికి కారణమైన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బాలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఫార్మా కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నాయకులు సత్యన్న పాల్గొన్నారు.

27నుంచి రిలే దీక్షలు

ఎమ్మిగనూరుటౌన్: సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 27,28,29 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట రిలే దీక్షలు చేపట్టనున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు విజయేంద్ర తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు పెండింగ్‌లోనున్న మెస్, కాస్మోటిక్ చార్జీలు, ట్రంక్ పెట్టెలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే.. వార్డన్ పోస్టులతో పాటు కుక్, కామాటీ పోస్టులు భర్తీ చేసి హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. మూతబడిన హాస్టళ్లను వెంటనే పునఃప్రారంభించాలని కోరారు. 27న చేపట్టే నిరసన దీక్షలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. అబ్దుల్‌ఖాదర్, నరసింహులు, రవి,సురేష్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై యువకుడి దాడి



ప్రవీణ్ కంటికి గాయమైన దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని చిన్నమార్కెట్ సమీపంలో సచివాలయం ఉద్యోగి ప్రవీణ్‌పై శుక్రవారం ఓ యువకుడు దాడి చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలు.. చిన్నమార్కెట్ సమీపంలో ముగ్గురు యువకులు ఒకే బైక్‌పై అతి వేగంగా వెళ్తూ సడన్ బ్రేక్ వేశారు. గమనించిన ప్రవీణ్.. నిదానంగా వెళ్లాలని సూచించాడు. ఈ విషయంలో మాటా మాటా పెరిగి ముగ్గురు యువకుల్లోని ఒకరు తనపై దాడి చేసి బైక్‌పై పరారయ్యాడని ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బెనకా గురువుల ఆరాధనోత్సవాలు ప్రారంభం



బెనకాగురువుల శిలావిగ్రహం ఊరేగింపు



అష్ట దేవతలకు ప్రత్యేక పూజలు

పెద్దకడబూరు: మండలంలో వెలసిన ముద్దురంగా గురువుల మఠంలో ఘనగురు దత్తాత్రేయ సాంప్రదాయులైన గంజిహళ్లి వెంకటాగురువుల శిష్యులు మహాతపస్వి బెనకా గురువుల 24వ ఆరాధనోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గద్దుగె పూజ, ధ్వజారోహణం చేపట్టారు. అనంతరం బెనకాగురువుల నూతన శిలావిగ్రహన్ని కుంభకలశ బాజాభజంత్రీలతో పురవీధుల గుండా ఊరేగింపుగా మఠం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం జలాధివాసం, గణహోమం, రుద్రహోమం వంటి పూజాకైంకర్యాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మఠం 5వ పీఠాధిపతులు బ్రహ్మేంద్రస్వామి మాట్లాడుతూ,, నేడు ధాన్యాధివాసం, శయ్యాధివాసం, గురుపూజ నిర్వహిస్తామన్నారు. రాత్రి తీర్థప్రసాదాల అనంతరం భజన కార్యక్రమం ఉంటుందన్నారు. ఆదివారం నిర్వహించే ప్రత్యేక పూజలతో ఆరాధనోత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.

అక్రమ మద్యం ధ్వంసం



రోలర్‌తో అక్రమ మద్యాన్ని ధ్వంసం చేస్తున్న సెబ్ ఏఈఎస్ బి.వినోద్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత పట్టుబడిన కర్ణాటక అక్రమ మద్యంను శుక్రవారం మండల పరిధిలోని పరమాన్‌దొడ్డి గ్రామానికి వెళ్లే దారిలో సెబ్ పోలీసులు ధ్వంసం చేశారు. సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి. వినోద్‌కుమార్ మాట్లాడుతూ సెబ్ సర్కిల్ పరిధిలోని పట్టుబడిన మద్యంను ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేదరకు ధ్వంసం చేసినట్లు చెప్పారు. 89 కేసుల్లో దాదాపు 2,300 లీటర్లకు పైగా ఆంధ్రా,కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను ధ్వంసం చేసినట్లు చెప్పారు. ధ్వంసం చేసిన మద్యం విలువ రూ. 10.50 లక్షలు ఉంటుందన్నారు. మద్యం కేసులో అరెస్టయిన వారు మళ్లీ మద్యం కేసులో అరెస్టయితే పీడీ యాక్ట్ నమోదు చేయడమే కాకుండా జిల్లా బహిష్కరణ చేసేందుకు వెనకాడమని హెచ్చరించారు. సెబ్ సీఐ భార్గవరెడ్డి, ఎస్ఐ సత్యానారయణ, సిబ్బంది ఉన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ



భోజనాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి నారాయణమూర్తి

మంత్రాలయం: మండల పరిధిలోని బీసీ బాలుర వసతి గృహాన్ని మండల ప్రత్యేకాధికారి నారాయణ మూర్తి ఆకస్మిక తనిఖీ చేశారు. శుక్రవారం ఎంపీడీఓ మణిమంజరితో కలిసి హాస్టల్ వసతులు, భోజనాన్ని పరిశీలించారు. అలాగే హాస్టల్ విద్యార్థులతో ముచ్చటించారు. భోజనం నాణ్యతపై ఆరా తీశారు. హాస్టల్ వార్డెన్ పిల్లలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

క్రైం కార్నర్

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని ఎస్. నాగలాపురం గ్రామానికి చెందిన ఏసురత్నం అనే వ్యక్తి భార్య కాపురానికి రాను అన్నందుకు శుక్రవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఏసురత్నం అదే గ్రామానికి చెందిన సునీతను పెళ్లిచేసుకున్నాడు. కొంత కాలం క్రితం భార్యభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరగటంతో సునీత పుట్టింట్లో ఉంటోంది. భార్యభర్తలకు శుక్రవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఉదయం రావాలని చెప్పి పంపించారు. అయితే తన భార్య కాపురానికి రానని చెప్పడంతో మనస్థాపంతో పురుగు మందు సేవించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బాడుగ ఇవ్వమన్నందుకు దాడి

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని బోడబండ గ్రామంలో ట్రాక్టర్ బాడుగ చెల్లించాలని కోరినందుకు భార్యాభర్తలపై దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కురవ వీరేష్ తన ట్రాక్టర్‌ను ఇంటి పక్కనే ఉంటున్న వడ్డే భీమేష్‌కు కొన్ని రోజుల క్రితం బాడుగకు పంపించాడు. అయితే రోజులు గడుస్తున్నా ట్రాక్టర్ బాడుగ ఇవ్వలేదు. దీంతో శుక్రవారం రాత్రి కురవ వీరేష్ భార్య శారద ట్రాక్టర్ బాడుగ ఇవ్వాలని వడ్డే భీమేష్‌ను అడగటంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో భీమేష్, హనుమంతు, పరమేష్.. భార్యభర్తలపై దాడి చేయటంతో వీరేష్,శారదకు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడి జరిగిన విషయంపై విచారణ చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు. కాగా బాధితులు వైఎస్సార్‌సీపీలో కొనసాగుతుండగా, దాడికి పాల్పడిన వారు టీడీపీ నాయకులని బాధితులు పేర్కొన్నారు.

గ్రామసభలతో సమస్యల పరిష్కారం

కౌతాళం: గ్రామసభలతో స్థానిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కౌతాళంలో సర్పంచ్ పాల్‌దినకర్, అగసలదిన్నెలో సర్పంచ్ పామన్న, ఎరిగేరిలో సర్పంచ్ గోవిందు, మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన శుక్రవారం గ్రామసభలు జరిగాయి. కౌతాళంలో అంబేడ్కర్ సర్కిల్ నుంచి వంక వరకు, మంగళి వీధి నుంచి శ్మశనం వరకు డ్రైనేజీలను నిర్మించాలని, అక్కమతోట కాలనీ వద్ద డ్రైనేజీతో పాటు సిమెంటు రోడ్డు వేయాలని, రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సిమెంటు రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. రాజనగర్ ఎస్ఎస్ ట్యాంకు నుంచి నాలుగు రోజులకోసారి, ఇతర గ్రామాలకు మూడు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారని, సమస్యను పరిష్కరించాలని సభ దృష్టికి తెచ్చారు. ఎన్టీఆర్ నగర్, పింజారిగేరిలో ట్యాంకులను నిర్మించాలన్నారు. ఉప సర్పంచ్ తిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా గ్రామ సభలు

మంత్రాలయం: రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు చేపట్టిన గ్రామ సభలు తూతూ మంత్రంగా జరిగాయి. మండల స్పెషల్ ఆఫీసర్ నారాయణమూర్తి, ఎంపీడీఓ మణిమంజరి నేతృత్వంలో గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు, గ్రామస్తులు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గ్రామాల్లో మురుగు నీటి కాలువలు, సీసీ రోడ్ల సమస్యలను లేవనెత్తారు. 52–బసాపురంలో ఎంపీడీఓ పాల్గొనగా ప్రత్యేకాధికారి ఆయా గ్రామాల్లో సభలను పర్యవేక్షించారు.

పెద్దకడబూరు: గ్రామంలోని పాఠశాలను అప్‌గ్రేడ్ చేయండంటూ చిన్నకడబూరు వాసులు కోరారు. మండలంలోని అన్ని పంచాయతీలలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలు ప్రశాంతంగా జరిగాయి. చిన్నకడబూరు గ్రామస్తులు తమ గ్రామంలోని పాఠశాలను యూపీ (ప్రాథమికోన్నత) పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ఎంఈఓ రామమూర్తికి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 275 మంది పిల్లలు చదువుకుంటున్నారన్నారు. యూపీ స్కూల్ మంజూరు కాకపోవడంతో 6వ తరగతి చదువు కోసం నాలుగు కిలోమీటర్ల దూరంలోని పెద్దకడబూరు గ్రామానికి వెళ్తున్నారన్నారు. దీనివల్ల డ్రాపౌట్లు పెరుగుతున్నాయని వాపోయారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి గ్రామంలోని పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ బంగారమ్మ తెలిపారు. మండలంలోని 17 పంచాయతీల్లో శుక్రవారం మండల పరిషత్ అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. కందనాతి గ్రామంలోని గ్రామ సభలో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని చెప్పారు. గ్రామసభల ద్వారా గ్రామాల్లో ఏమైన సమస్యలు ఉంటే తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. రోడ్లు, మురుగు కాలువల సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయా పంచాయతీల్లో ఈవోఆర్డీ విజయలక్ష్మి, సూపరింటెండెంట్ అనసూయ, ఏపీఓ విజయమోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోనబావిలో గ్రామసభ

ఆదోని రూరల్: మండలంలోని గోనబావిలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ గీతా వాణి మాట్లాడుతూ డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, తాగునీరు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సంక్షిప్తం

నాటుసారా స్వాధీనం

ఆదోని అర్బన్: స్థానిక బోయగేరి ఆంజనేయస్వామి గుడి వద్ద 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, వాల్మీకి అంజలి, బసాపురం లక్ష్మన్న, బోయ కృష్ణలను అదుపులో తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి పనులు ప్రారంభించాలి

ఆదోని రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, సంఘం మండలాధ్యక్షులు జి.రంగనాథ్, రైతు సంఘం మండలాధ్యక్షులు శేఖర్ శుక్రవారం పాండవగల్లులో జరిగిన గ్రామసభలో అధికారులను కలిసి విన్నవించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: రాంజల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ కొత్త లైన్ పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ పురుషోత్తం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఆరేకల్, ఎంఐజీ, ఎల్ఐజీ, ఆర్ట్స్ కళాశాల, పంప్‌హౌస్, శక్తిగుడి ఫీడర్స్‌లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్ శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏఓ సాయివినిత్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎస్సీ, బీసీ బాలికలు, బాలురు వసతి గృహాల్లో సరైన మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గదులకు కిటికీలు, తలుపులు సరిగా లేక పోవడంతో రాత్రి చలి, దోమలతో ఇబ్బంది పడుతున్నారని, ఆహారంలో నాణ్యత పాటించడం లేదని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, చంద్ర, శరత్, నవీన్, గోవర్ధన్ ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆదోని ఆర్ట్స్ కళాశాల కరస్పాండెంట్ దైవా. దీనంరెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాల ఆవరణంలో తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్, అధ్యాపకులు ఎర్రిస్వామి, ఎన్ఎస్ఎస్ అధికారులు జోనాథన్, ఉమాదేవి, వెంకట్రామిరెడ్డి, రాము, మూర్తి పాల్గొన్నారు.

జ్యోతిష్యుడికి డాక్టరరేట్



జ్యోతిష్యుడు గరుడాద్రి దత్తాత్రేయశర్మ

ఆదోని అర్బన్: పట్టణానికి చెందిన జ్యోతిష్యుడు గరుడాద్రి దత్తాత్రేయశర్మకు ఆర్ఈజీ అండర్ నీతి అయోగ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ ఐఏఎంఏ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా యూఎస్ఏ డాక్టరేట్ ప్రదానం చేసింది. జ్యోతిష్య శాస్త్రంలో 'కాలసర్పదోషం ప్రభావాలు' అంశంపై చేసిన పరిశోధనలకు గానూ శుక్రవారం రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్ శ్రీ మహర్షి కాలేజ్ ఆఫ్ వైదిక్ ఆస్ట్రాలజీ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో చాన్సలర్ చావ్లా, ప్రొఫెసర్ రుద్రముని తనకు వాచస్పతి బిరుదు ప్రదాన పత్రాన్ని అందజేశారని దత్తాత్రేయశర్మ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్ఐ చంద్రమోహన్

కోసిగి: మండల ఎస్ఐగా పి.చంద్రమోహన్ శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఎస్ఐల బదిలీలో భాగంగా నంద్యాల జిల్లా రాచర్ల స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయన బదిలీపై కోసిగి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ సతీష్‌కుమార్‌ను కర్నూలు వీఆర్‌కు పంపించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కౌతాళం ఎస్ఐగా మహమ్మద్ రిజ్వాన్



ఎస్ఐ రిజ్వాన్

కౌతాళం: మండల ఎస్ఐగా మహమ్మద్ రిజ్వాన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో అందరినీ కలుపుకుని శాంతిభద్రలను కాపాడుతాం అని, అసాంఘిక చర్యలపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. ఆయన చిప్పగిరి పోలీస్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.